

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

ఓటమి భయంతోనే

# ప్రలోభాలు

- బీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచ్‌ల కొనుగోళ్లు
- కర్ణాటకలో అమలు కానివి తెలంగాణలో 6 పథకాల హామీ
- బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రలోభాలకు లొంగరు
- వెర్రివేశాలు వేస్తే.. సహించేదిలేదు
- కొనుగోళ్లను బట్టబయలు చేసిన బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు
- సాక్ష్యాలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 27 : కొడంగల్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకున్నదని, కాబట్టే బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, నాయకులను కోనుగోలు చేసేందుకు పన్నాగం పన్నుతున్నారని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, భూగర్భజల, గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఓటమి భయంతో కొడంగల్‌లో ప్రతి సర్పంచ్‌కు రూ.15లక్షలు ఏరవేసి కొనేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, బీఆర్‌ఎస్ నాయకులు ధర్మానికి, పార్టీకి కట్టుబడి ఉండేవారు కాబట్టే కాంగ్రెస్ యత్నాన్ని తిప్పికొట్టి, రేవంత్‌కు చెంప పెట్టు సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలను ఓట్లు అడిగే దమ్ముధైర్యం లేక రేవంత్‌రెడ్డి దిగజారుడు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌పై ఇప్పటికే ప్రజలకు నమ్మకం పోయిందని, ఇటువంటి వెర్రివేషాల వల్ల మరింత అసహ్యం కలుగుతున్నదన్నారు. పైసకు అమ్ముడుపోయే గుణం రేవంత్‌రెడ్డికి ఉన్నదని, అందరికీ అటువంటి బుద్ధి ఉందని అనుకుంటే పప్పులో కాలేసినట్లేనని సమాధానమిచ్చారు. ప్రజల ఆశీస్సులు బీఆర్‌ఎస్‌కు మెండుగా ఉన్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఎన్ని జిమ్మికులు, కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ కొడంగల్‌లో భారీ మెజార్టీతో పట్నం నరేందర్‌రెడ్డి విజయం ఖాయమని, కొడంగల్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందన్నారు. కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు నేటి వరకూ ఏ ఒక్కటీ అమలు కావడం లేదనే విషయాన్ని మొన్న కర్ణాటక రైతులు కొడంగల్‌లో గోడును వినిపించుకున్నారన్నారు. అధికారంలో ఉన్న కర్ణాటకలో 6 గ్యారెంటీలు అమలు చేసే ఊసు లేదు కానీ, తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అక్కడ అమలు చేయని వారు ఇక్కడ ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులకు రూ.16వేల పంట పెట్టుబడి, రూ. 4 నుంచి 6వేల వరకు ఆసరా పింఛన్ల పెంపు, రూ.15లక్షల ఆరోగ్యశ్రీ, పేద మహిళలకు ప్రతి నెలా రూ.3వేలు, రూ.5లక్షల కుటుంబ బీమా వంటి ఎన్నో అద్భుత పథకాలను అందించే హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చడంతో పాటు ఎన్నో ఊహించని పథకాలను అందించిన విషయం ప్రజలకు తెలుసు అన్నారు. బీఆర్‌ఎస్ సర్పంచ్‌ల కొనుగోలుకు సంబంధించి కాంగ్రెస్ నాయకుల వాయిస్ రికార్డులు ఉన్నాయని, ఎన్నికల కమిషన్‌కు అందిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్‌ల కొనుగోలును తిప్పికొట్టి కాంగ్రెస్ నాయకులను పోలీసులకు పట్టించిన బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు నర్సింహానాయక్, రవినాయక్, శంకర్‌నాయక్‌లను మంత్రి అభినందించారు. బీఆర్‌ఎస్‌లో ఇటువంటి నిజాయితీగా ఉన్న నాయకులు ఎందరో ఉన్నారని, వీరి జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ మధుసూదన్‌రావుయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు దేశ్యానాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేకి కాంగ్రెస్

- రైతుబంధు నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ లేఖ
- కాంగ్రెస్ పార్టీపై జిల్లా రైతాంగం ఆగ్రహం
- బీఆర్‌ఎస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు
- జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ధర్నాలు, దిష్టిబొమ్మల దహనం
- కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా హోరెత్తిన నినాదాలు
- ఇప్పటికే వ్యవసాయానికి 3 గంటల కరెంటే సరిపోతదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

వికారాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అనేది మరోసారి స్పష్టమైంది. ఇప్పటికే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అవసరంలేదు, మూడు గంటల కరెంట్ సరిపోతదని రైతు వ్యతిరేక విధానమే మా నినాదమనే విధంగా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ మరోసారి రైతులకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. రైతులకు పంట పెట్టుబడి నిమిత్తం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న రైతుబంధు సహాయాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసింది. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు ఎకరాకు రూ.5 వేల రైతుబంధు సాయం జమ చేయకుండా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి అడ్డుకున్నది. ఈ మేరకు రైతుబంధు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ లేఖ రాయడంపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. జిల్లా అంతటా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలను దహనం చేయడంతోపాటు ఆందోళనలు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్లీ రైతులకు కష్టాలు తప్పవని, రైతుబంధు, వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా, రైతుబీమా తదితర పథకాలను కాంగ్రెస్ పార్టీ రద్దు చేస్తదనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పూర్తిగా తగ్గిన రైతుల ఆత్మహత్యలు.. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రైతుల సంక్షేమానికి దేశంలో ఎక్కడాలేని విధంగా అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, 24 గంటల కరెంట్, సకాలంలో ఎరువులు, విత్తనాలు తదితర పథకాలను అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో రైతులకు శ్రీరామరక్ష అని జిల్లా రైతులు పేర్కొన్నారు. మొదటి నుంచి రైతాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు సాగునీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభం నుంచి కాంగ్రెస్ నాయకులు వేసిన కేసులతో దాదాపు 8 ఏండ్ల పాటు పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

కోస్గి పట్టణం శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం

కోస్గి, అక్టోబర్ 27 : రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శాసం రామకృష్ణ అన్నారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ లేఖ రాసినందుకు నిరసనగా శుక్రవారం కోస్గి పట్టణం శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు మాట్లాడే కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మవద్దన్నారు. రైతులకు నిరంతర కరెంట్‌ను సరఫరా చేస్తే ఓర్వలేని కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న విషయాన్ని బుద్ధిలేని కాంగ్రెస్ నాయకులు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హన్మంతురెడ్డి, రైతుబంధుసమితి మండల అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలు, కోస్గి మున్సిపాలిటీ అధ్యక్షుడు మ్యకల రాజేశ్, కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి , బీఆర్‌ఎస్ నాయకలు రాజశేఖర్‌రెడ్డి, బాల్‌రాజ్, వెంకటనర్సింలు, వెంకటయ్య అంజిలయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ

‘రైతుబంధు’పై

# కాంగ్రెస్ కుట్రలు సరికాదు

బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత

వికారాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డాక్టర్ సబిత, బీఆర్‌ఎస్ శ్రేణులు

వికారాబాద్, అక్టోబర్ 27 : వ్యవసాయ సాగు పెట్టుబడికి సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలు చేస్తూ అన్నదాతల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని కొత్రేపల్లిలో గడపగడపకూ వెళ్లి ఆమె ప్రచారం నిర్వహించారు. రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ లెటర్ రాయడంపై ఆమె మండిపడ్డారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులను ఆగం చేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలను నమ్మొద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళాకమాల్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రవళికాకృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, రామస్వామి, పుష్పలతారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, షఫీ పాల్గొన్నారు.

# ప్రాణం పోయినా బీఆర్‌ఎస్‌ను వీడం

కాంగ్రెస్‌కు క్యాడర్ లేక సర్పంచ్‌ల కొనుగోళ్లు.. భారీ మెజార్టీతో నరేందర్‌రెడ్డిని గెలిపించుకుంటాం

కొడంగల్ : ప్రలోభాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు ప్రతి బీఆర్‌ఎస్ నాయకుడు బుద్ధి చెప్పాలని బొంరాస్‌పేట మండంలోని గిరిజన సర్పంచ్‌లు నర్సింహానాయక్, రవినాయక్, శంకర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ కొనుగోళ్ల బాగోతంపై వారు విలేకరులతో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ డాక్యానాయక్ ద్వారా గత మూడు, నాలుగు రోజులుగా కాంగ్రెస్ నాయకులు మమ్మల్ని ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఫోన్ ద్వారా మాట్లాడుతున్న ప్రతి సమాచారాన్ని రికార్డు చేసుకున్నామని, పథకం ప్రకారం గురువారం మండలంలోని వడిచెర్ల గేటు సమీపంలో డబ్బులు ఇచ్చే క్రమంలో పోలీసు అధికారులకు సమాచారాన్ని అందించి పట్టించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుల్లా పైసలకు బీఆర్‌ఎస్ నాయకులు అమ్ముడుపోతారని అనుకొన్నారని, ఈవిధంగా తిప్పికొడతామని ఊహించుకోలేదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు క్యాడర్ లేని కారణంగా సర్పంచ్‌ల కొనుగోళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రతి సర్పంచ్‌కు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు డబ్బులు ఫిక్స్ చేసినట్లు తెలిపారు. ఓడిపోతామనే విషయం కాంగ్రెస్ నాయకులు గుర్తించుకోవడం జరిగిందని, ఈ విధంగా అడ్డదారిన అధికారాన్ని దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు పార్టీకి కట్టుబడి ఉంటారని, కాంగ్రెస్ నాయకుల్లా అమ్ముడుపోయే ప్రసక్తే లేదన్నారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని గెలిపించుకొంటామని తెలిపారు.



ఎమ్మెల్యే సమక్షంలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ గిరిజన సర్పంచ్‌లు